# పెట్టుబడిదారుల వైపా..? పేద బిడ్డ వైపా..?

## ఏ దిక్కు ఉంటారో ప్రజలే నిర్ణయించుకోవాలి

- పచ్చబడ్డ చెన్నూర్‌లో చిచ్చుపెట్టే కుట్ర
- గుండా రాజకీయాలు పోవాలి.. అభివృద్ధి రాజకీయాలు రావాలి
- పదేళ్లలో చేపట్టిన ప్రగతే తిరిగి గెలిపిస్తుంది
- చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్
- తన సతీమణితో కలిసి జగన్నాథస్వామి ఆలయంలో పూజలు
- ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు



నామినేషన్ పత్రాలతో శ్రీ జగన్నాథస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బాల్క సుమన్ దంపతులు

చెన్నూర్, నవంబర్ 9 : చెన్నూర్ నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీతో తనను మరోసారి ఆశీర్వదిస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఉదయం చెన్నూర్ పట్టణంలోని జగన్నాథ స్వామి ఆలయంలో తన సతీమణి అలేఖ్యతో కలిసి నామినేషన్ పత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ర్యాలీగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. రిటర్నింగ్ అధికారి సిడం దత్తుకు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాల్క సుమన్ తరపున మాజీ మంత్రి బోడ జనార్దన్ రెండో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి ఇచ్చారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిర్వహించిన రోడ్ షోలో పాల్గొని మాట్లాడారు. మందమర్రిలో ఈ నెల 7న నిర్వహించిన సీఎం కేసీఆర్ సభకు ప్రజలు వేలాదిగా తరలివచ్చి ఆశీర్వదించారని, ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు గుండా రాజకీయాలకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి వివేక్.. అతడి కుటుంబ సభ్యులు ఈ ప్రాంతం నుంచి రాజకీయంగా ఎదిగి వేల కోట్ల ఆస్తులు సంపాదించుకున్నారని, అభివృద్ధిని మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. దేశమంతా కంపెనీలు, ఫ్యాక్టరీలు పెట్టిన ఆయన చెన్నూర్‌లో ఒక్క ఫ్యాక్టరీ కూడా ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. పక్కనే గోదావరి, ప్రాణహిత నదులున్నా చుక్క నీరు ఎందుకు తీసుక రాలేదని నిలదీశారు. కేవలం ఎన్నికల్లో గెలిచేందుకు సూట్‌కేసులతో ఇక్కడికి వచ్చి.. అడ్డగోలుగా లీడర్లను కొంటున్నారని మండిపడ్డారు. చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో వేలం పాటలు నడుస్తున్నాయని.. పెట్టుబడిదారుల వైపు ఉంటారో.. పేద బిడ్డ వైపు ఉంటారో?.. వ్యాపార వేత్తల వైపు ఉంటారో.. ఉన్నత విద్యావంతుడి వైపు ఉంటారో.. వేల కోట్ల ఆస్తులు ఉన్నోళ్ల దిక్కు ఉంటారో.. వేల కోట్ల నిధులు తీసుక వచ్చి అభివృద్ధి చేసే దిక్కు ఉంటారో.. ప్రజలే ఆలోచన చేయాలన్నారు. ఈ ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి టికెట్లు అమ్ముకున్నాడని, టికెట్లు అమ్ముకున్న కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేస్తే.. రేపు రాష్ట్రాన్ని అమ్ముకుంటుందన్నారు. వాళ్ల ఇండ్ల చుట్టూ తిరిగే పరిస్థితులు రావద్దని, మన జీవితాలను ఆగం చేసుకోవద్దని యువతకు విజ్ఞప్తి చేశారు. పచ్చబడ్డ చెన్నూర్ నియోజకవర్గంలో చిచ్చు పెట్టే కుట్ర చేస్తున్నారని మండి పడ్డారు. ప్రజలారా ఆగం కాకండి, ఈ బిడ్డను కాపాడండి. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అని కోరారు. నియోజకవర్గంలో గుండా, హత్యా, బెదిరింపు రాజకీయాలు పోవాలని, అభివృద్ధి రాజకీయాలు రావాలన్నారు. దేశానికి 75 ఏండ్ల క్రితం స్వాతంత్ర్యం వచ్చిందని, ఈ రోజు పని చేసే నాయకుడిని, పని చేసే ప్రభుత్వాన్ని, పని చేసే పార్టీలను పట్టించుకోవాలని ఆయన కోరారు. పుట్టిన బిడ్డ.. తల్లి దగ్గర ఉంటే ఎంత భద్రంగా ఉంటదో, తెచ్చుకున్న తెలంగాణ కేసీఆర్ చేతిలో ఉండాలని, అదే విధంగా చెన్నూర్ నియోజకవర్గం బాల్క సుమన్ చేతిలో ఉండాలన్నారు. వేరే వాళ్ల చేతికి పోతే సామంత రాజుల పాలన వస్తుందని, బెదిరింపు రాజకీయాలు వస్తాయని, వ్యాపారస్తులు సరిగా పని చేసుకోనటువంటి రోజుల వస్తాయని హెచ్చరించారు. దళిత గిరిజన.. బడుగు బలహీన వర్గాల వారు పెట్టు బడుదారులు, సామంత రాజుల ఇండ్ల చుట్టూ చేతులు కట్టుకొని.. వాళ్ల కాళ్లు మొక్కి బతికే పరిస్థితులు వస్తాయని, దయచేసి అటువంటి వివక్ష.. అసమానతలు నియోజకవర్గంలో రావద్దంటే కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ పదేళ్లలో చేపట్టిన ప్రగతే తిరిగి తనను గెలిపిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఎక్కడా ఎలాంటి గొడవలకు తావులేకుండా.. శాంతియుతమైన వాతావరణంలో ఎన్నికలు జరగాలని కోరుతున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



**నామినేషన్ల జాతర**

నామినేషన్ పత్రాలను చూపిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్

# అభివృద్ధి, సంక్షేమం వైపే ప్రజలు

- మరోసారి బీఆర్ఎస్‌కే పట్టం కడుతారు
- మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు
- ఆలయాల్లో పూజలు చేసి.. నామినేషన్ దాఖలు



నామినేషన్ వేసేందుకు ఇంటినుంచి బయలుదేరిన ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల టౌన్, నవంబర్ 9 : నియోజకవర్గ ప్రజలంతా అభివృద్ధి, సంక్షేమం వైపే ఉంటారని, మరోసారి కారుకే పట్టం కడుతారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు పేర్కొన్నారు. గురువారం హంగూ ఆర్భాటం లేకుండా తన ఇంటికి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేసుకుంటూ.. నలుగురు మద్దతుదారులతో కలిసి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. అంతకుముందు కుటుంబ సభ్యులతో కలిసి సాయిబాబా ఆలయంలో నామినేషన్ పత్రాలతో సహా పూజలు చేశారు. అక్కడినుంచి విశ్వనాథాలయం, హనుమాన్ ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటికి చేరుకున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు తన అక్కా, బావల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎమ్మెల్యే సతీమణి రాజకుమారి ఆయన నుదుటన బొట్టుపెట్టిన అనంతరం నామినేషన్ వేసేందుకు బయలుదేరి వెళ్లారు. సతీమణి రాజకుమారి, మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావ్, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, లక్సెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్యలతో కలిసి నామినేషన్‌ను దాఖలుచేశారు. అనంతరం ఎమ్మెల్యే దివాకర్‌రావు విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ వల్లనే రాష్ట్రం అభివృద్ధి చెందిందన్న విషయం ప్రజలకు తెలుసని, వారంతా మరోసారి బీఆర్ఎస్‌నే ఎన్నుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ఓటర్లంతా కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు.

# పూజలు చేసి.. నామినేషన్ వేసి..

## ఎమ్మెల్యే సక్కుతో కలిసి దాఖలు చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి



నామినేషన్ వేసేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మి, ఎమ్మెల్యే సక్కు, అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్,నవంబర్9 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం నామినేషన్ల పర్వం జోరందుకుంది. కోవలక్ష్మి తన కుటుంబ సభ్యులతో కలిసి కేస్లాపూర్ హనుమాన్ ఆలయం, బజార్‌వాడీ శివాలయం, అయ్యప్ప ఆలయం, జన్కాపూర్ కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కోవ అరుణ, మర్సుకోల సరస్వతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావుతో కలిసి రిటర్నింగ్ అధికారికి నామిషన్ పత్రాలు అందజేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా కోవలక్ష్మి రెండో నామిషన్ పత్రాలను పార్టీ మండల అధ్యక్షుడు గంధం శ్రీనివాస్,అబ్దుల్లా, బుర్స పోచ్చయ్య రిటర్నింగ్ అధికారికి అందజేశారు. కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీర శ్యాంనాయక్ నామినేషన్ దాఖలు చేశారు. గోండ్వాన ఘనతంత్ర పార్టీ అభ్యర్థిగా ఆత్రం గోవర్ధన్ నామినేషన్ వేశారు. బహుజన ముక్తి మోర్చ పార్టీ అభ్యర్థిగా బుక్య పల్లవి నామిషనేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా సిడాం అన్నిగా, మెస్రం నవీన్‌కుమార్, మనావత్ బాలాజీ నామినేషన్లు వేశారు. ఒకే రోజు ఎడుగురు అభ్యర్థులు నామినేషన్ దఖాలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి దాసరి వేణు తెలిపారు.

# మరోసారి ఆశీర్వదించండి.. అండగా ఉంటా

- పగటి వేషగాళ్లను నమ్మి మోసపోవద్దు
- మనోళ్లెవరో.. మందోళ్లెవరో గుర్తించాలి
- సిర్పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప
- బుద్ధుడికి మొక్కి.. నామినేషన్ దాఖలు



కోనేరు కోనప్పను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

సిర్పూర్(టీ) నవంబర్ 09 : ఈ ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదిస్తే.. అండగా ఉంటానని సిర్పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప పేర్కొన్నారు. గురువారం సిర్పూర్(టీ) మండలకేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ పదేళ్లలో సిర్పూర్(టీ) నియోజకవర్గాన్ని ఊహించనంతగా అభివృద్ధి చేసి చూపించానన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, ప్రతి గ్రామానికీ రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. నియోజకవర్గంలో దాదాపు 50 వరకు బ్రిడ్జిలు నిర్మించి రవాణా సౌకర్యం మెరుగుపరచానని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని కొనియాడారు. ఎలక్షప్పుడు వచ్చిపోయే పగటి వేషగాళ్లను నమ్మి మోసపోవద్దని, కోనేరు కోనప్ప ఇక్కడే ఉండి సేవ చేస్తాడన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మనోళ్లెవరు.. మందోళ్లెవరనేది గుర్తించి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చా రు. బుద్ధుడి ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉంటాయని, అందుకే నాగమ్మ చెరువులోని బుద్ధుడి విగ్రహాన్ని దర్శించుకొని నామినేషన్ వేశానని చెప్పారు. కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, నాయకులు కేజర్‌హుస్సేన్, యాదగిరి బ్రహ్మయ్య, సుహేల్ అహ్మద్, ఈర్ల సత్యనారయణ, బొమ్మన శ్రీనివాస్, తోట మహేశ్, తంగడిపల్లి సంతోష్, దుబ్బుల నానయ్య, విశ్వనాథ్, సర్పంచ్‌లు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వగృహంలో కోనప్ప పూజలు

కాగజ్‌నగర్, నవంబర్ 9 : పట్టణంలోని గుంటూర్ కాలనీలో ని తన నివాసంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప గురువారం ఉదయం వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నామినేషన్ దాఖలు చేయడానికి సిర్పూర్ మండల కేంద్రానికి బయలుదేరారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం సిర్పూర్(టీ) మండల కేంద్రానికి బయలుదేరారు. జడ్పీ వైస్ చైర్మన్ కృష్ణారావు, కోనేరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోనేరు వంశీ, మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ దస్తగీర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వీవీ ప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ రాజేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.